క్లుప్తంగా

మెగా మల్టీ స్పెషాలిటీ వైద్య శిబిరం రేపు

కొత్తపట్నం: మండల కేంద్రమైన కొత్తపట్నంలో శ్రీవాణి విద్యానికేతన్ స్కూల్ ఆవరణలో ఈ నెల 29న శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా మల్టీ స్పెషాలిటీ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ చాపల వంశీకృష్ణ తెలిపారు. సీనియర్ ఎముకలు, కీళ్లు, నరములు, వెన్నెముక, కీళ్ల మార్పిడి వైద్య నిపుణులు చాపల వంశీకృష్ణ, సీనియర్ గర్భకోశ, ప్రసూతి వైద్య నిపుణులు, లేపరోస్కోపిక్ సర్జన్, సంతాన సాఫల్యత, హైరిస్క్ ప్రెగ్నెన్సీ స్పెషలిస్ట్ డాక్టర్ చాపల శాంత కుమారి, ఫ్యామిలీ, జనరల్ ఫిజీషియన్, జ్వరాల, బీపీ, షుగర్, థైరాయిడ్, కొలస్ట్రాలు, గుండె, కిడ్నీ, లివర్, మెదడు, పక్షవాతం, ఫిట్స్, సాధారణ వ్యాధుల వైద్య నిపుణులు డాక్టర్ సానల ధీరజ్‌బాబు.. జనరల్, లేపరోస్కోపిక్ సర్జన్, అపెండిక్స్, హెర్నియ, వరిబీజం, పసరతిత్తిలో రాళ్లు, అల్సర్, కిడ్నీలో రాళ్లు, వేరికోస్ వెయిన్స్ వైద్య నిపుణులు డాక్టర్ సున్నపు విజయ్‌కుమార్, టీబీ, నెమ్ము, ఆయాసం, ఊపిరితిత్తులు, ఛాతీ వైద్య నిపుణులు, క్రిటికల్ కేర్, బ్రాంకోస్కోపీ స్పెషలిస్ట్ నాగిరెడ్డి కుమార్‌వర్మ, డెంటల్, రూట్ కెనాల్ ట్రీట్‌మెంట్ వివిధ రకాల వైద్య నిపుణులు డాక్టర్ సున్నపు నవీన, ఫిజియోథెరపీ నిపుణులు పొక్కినగారి ఏడుకొండలు హాజరు కానున్నారన్నారు. ఉచితంగా మందులు ఇవ్వటం జరుగుతుందన్నారు.

డీటీ సేవలు అభినందనీయం


డిప్యూటీ తహసీల్దార్‌ను సత్కరిస్తున్న తహసీల్దార్ మధుసూదన్ రావు

చీమకుర్తి: డిప్యూటీ తహసీల్దార్ బి.సత్యసాయి శ్రీనివాసరావు అందిస్తున్న సేవలు అభినందనీయమని తహసీల్దార్ పిన్నిక మధుసూదన్‌రావు ప్రశంసించారు. శుక్రవారం చీమకుర్తి రెవెన్యూ కార్యాలయంలో డీటీ సాయి శ్రీనివాసరావును తహసీల్దార్, వారి సిబ్బంది ఆధ్వర్యంలో శాలువాతో పూలమాల వేసి ఘనంగా సత్కరించారు. డీటీ అందించిన ఉత్తమ సేవలకు గుర్తుగా గురువారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్, జేసీ చేతుల మీదుగా ప్రశంసపత్రం అందుకున్న సందర్భంగా రెవెన్యూ సిబ్బంది ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

ఒంగోలు సబర్బన్: నగరంలోని 31వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహిస్తున్నట్లు ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి కార్యాలయం వారు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో శనివారం ఉదయం 8 గంటలకు డివిజన్ పరిధిలోని విజయనగర్ కాలనీ వార్డు సచివాలయం పరిధిలోని సీఆర్‌పీ క్వార్టర్స్ డౌన్ నుంచి ప్రారంభమవుతుందన్నారు. డివిజన్ కార్పొరేటర్ తన్నీరు నాగజ్యోతి నాగేశ్వర రావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో ఒంగోలు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. డివిజన్‌లోని ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్పొరేటర్లతో పాటు ఇతర నాయకులు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

29న జేవీవీ జిల్లా స్థాయి శిక్షణ తరగతులు

ఒంగోలు టౌన్: ఈనెల 29న గిద్దలూరులోని అభిలాష్ మినీ ఫంక్షన్ హాల్లో జేవీవీ కార్యకర్తల జిల్లా స్థాయి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి సి.హెచ్. జయప్రకాష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ తరగతుల్లో మానవ పరిణామ క్రమం, సైన్సు ఎదుర్కొంటున్న సవాళ్లు అనే అంశంపై నెల్లూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ షేక్ కాలేషా సాహెబ్, గ్లోబల్ వార్మింగ్– పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై జనరల్ సర్జన్ డాక్టర్ బి.శరత్‌లు ఉపన్యసిస్తారని వివరించారు. రాష్ట్ర నాయకులు కుర్రా రామారావు, పి.స్వరూప రెడ్డి, కె. సుబ్రహ్మణ్యం, షేక్ ఖాజాహుసేన్ శాస్త్రీయ సమాజ నిర్మాణం, జేవీవీ కర్తవ్యం గురించి ప్రసంగిస్తారని వెలిపారు.

కొణిదెనలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం

బల్లికురవ: మండలంలోని కొణిదెన గ్రామ సమీపంలోని బ్రహ్మకుండం వద్ద వేంచేసిఉన్న శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి మూడో శాంతి కళ్యాణం ఈ నెల 31న ప్రారంభిస్తున్నట్లు ఆలయ కమిటీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5 గంటలకు అంకురార్పణ, గణపతి పూజ, పుణ్యాహవచన, పంచగవ్య ప్రాసన, ఋత్విగ్వరణ, మండపారాధనతో వేడుకలు ప్రారంభమౌతాయని చెప్పారు. సాయంత్రం నూతన నందీశ్వరునికి జలాధి, క్షీరాధివాస అభిషేకాలు, లక్ష్మీ గణపతి, నవగ్రహ, దక్షిణామూర్తి, దుర్గాదేవి, వాస్తు రుద్రహోమాలు రాత్రికి కోలాటం ఫిబ్రవరి 1 ఉదయం 8.25 కు నంది ప్రతిష్ట, స్వామివార్ల శాంతి కల్యాణం, అన్నదానం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రుగ్వేద పండితులు టి. సత్యనారాయణశర్మ బృందంచే జరిగే వేడుకలకు గ్రామంతోపాటు పరిసర గ్రామాల్లోని భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలన్నారు.

డ్రైన్ల నిర్మాణానికి భూమి పూజ


బూరేపల్లి పునరావాస కాలనీలో భూమి పూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, నాయకులు

మద్దిపాడు: మౌలిక సదుపాయాలకు తమ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని సంతనూతలపాడు శాసన సభ్యుడు టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు. శుక్రవారం బూరేపల్లి పునరావాస కాలనీలో సైడు డ్రైన్లు, కల్వర్టుల నిర్మాణాలకు ఎమ్మెల్యే భూమి పూజ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సవతులు కల్పించడానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్ద పీటవేస్తుందని తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సచివాలయానికి 20 లక్షల రూపాయలు మంజూరు చేశామని, మరో రెండు నిధుల నుంచి కూడా డబ్బు కేటాయింపు చేస్తున్నామని తెలిపారు. ఈనిధులతో కాలనీల్లో ప్రాధాన్యత ప్రాతిపదికన సైడు డ్రైన్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. కన్నెబోయిన వెంకటాద్రి, రాయపాటి రమేష్, అవినాష్, తేళ్ల పుల్లారావు, విల్సన్ శేషయ్య తదితర నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి


నేలటూరులో ఇంటిని పరిశీలిస్తున్న స్పెషల్ ఆఫీసర్ రూన్సీరాణి, అధికారులు


గృహాలను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి అర్చన

మద్దిపాడు: ఇళ్ల నిర్మాణాలు ఉగాది పండగలోగా పూర్తి చేసుకోవాలని మండల స్పెషల్ ఆఫీసర్ ఝాన్సీరాణి అన్నారు. శుక్రవారం నేలటూరు జగనన్న కాలనీలో లబ్ధిదారులతో మాట్లాడారు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసి ఉగాది నాటికి ఇళ్లలో చేరాలని లబ్ధిదారులను కోరారు. వైఎస్సార్ క్రాంతిపథం ద్వారా లబ్ధిదారులకు 35 నుంచి 50 వేల రూపాయల ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు బేస్‌మెంట్‌లెవల్ వేసుకుంటే బిల్లులు పెండింగ్‌లేకుండా వెంటనే ఇస్తామన్నారు. లబ్ధిదారులు త్వరిత గతిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలని తెలిపారు. తహసీల్దార్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ స్థలాలు తీసుకుని ఇంటి నిర్మాణం చేయకుండా ఆగిపోతే అటువంటి స్థలాలను వెనక్కు తీసుకుంటారన్నారు. ఏఓ సుబ్బారావు, డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు, హౌసింగ్ ఏఈ హేమలత, పీఆర్ ఏఈ సునీల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మహేంద్రరెడ్డి, ఏపీఎం నరేంద్రకుమార్, సర్పంచ్ వడేల మహాలక్ష్మి, గజేంద్ర పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి

ఈతముక్కల (కొత్తపట్నం): జగనన్న గృహాలతో పాటు సొంతగా స్కీంలు కట్టుకుంటున్న గృహాలు కూడా పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి అర్చన ఆదేశించారు. శుక్రవారం ఈతముక్కల గృహాలను పరిశీలించారు. 75 సొంత గృహాలు ప్రారంభించగా 50 గృహాలు ఇప్పటికే పూర్తి అయ్యాయని, 25 గృహాలు నిర్మాణంలో ఉన్నాయన్నారు. ఏఈ అన్నం నాంచార్లరెడ్డి, వర్క్‌ఇన్‌స్పెక్టర్ చింపిరయ్య పాల్గొన్నారు.

దేశ రక్షణలో విశేష సేవలు


మేదరమెట్ల శ్రీనివాసరావును సత్కరిస్తున్న పేరం శ్రీనివాసరావు

చీమకుర్తి: బూదవాడకు చెందిన రిటైర్డ్ ఆర్మీ సైనికుడు మేదరమెట్ల శ్రీనివాసరావు దేశ రక్షణలో విశేష సేవలందించారని గిరిజన భవనం జిల్లా అధ్యక్షుడు పేరం శ్రీనివాసరావు అన్నారు. ఆయన ఆర్మీలో 24 సంవత్సరాలు పాటు సేవలందించినందుకు గురువారం చీమకుర్తిలో సత్కరించారు. కె. శ్రీనివాసరావు, పీటర్, కోటేశ్వరరావు, స్థానికులు పాల్గొన్నారు.

పేస్‌లో గెస్ట్ లెక్చర్


గెస్ట్ లెక్చర్ ఇస్తున్న డేటా సైంటిస్ట్ నిఖిల్ రెడ్డి

ఒంగోలు: స్థానిక పేస్ ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం తృతీయ సంవత్సరం కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు మెషీన్ లెర్నింగ్ అల్గారిథమ్స్‌పై గెస్ట్ లెక్చర్ నిర్వహించారు. రీసోర్సు పర్సన్‌గా కాంటినెంటల్ ఐటీలో డేటా సైంటిస్ట్‌గా పనిచేస్తున్న ఎం. నిఖిల్ రెడ్డి వ్యవహరించారు. ఆయన మాట్లాడుతూ మెషీన్ లెర్నింగ్ సాంకేతికతను విద్యార్థులకు పరిచయం చేస్తూ కొన్ని అప్లికేషన్లను విద్యార్థులకు వివరించారు. ప్రస్తుతం డేటా ప్రాసెసింగ్‌లో ఉపయోగిస్తున్న కొన్ని అల్గారిథమ్స్‌పై అవగాహన కల్పించారు. కాలేజీ సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థులు తమ జీవితంలో ఉన్నత స్థానాల్లో ఉండాలన్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి పాల్గొన్నారు.

స్కీం వర్కర్లకు కనీస వేతనం చెల్లించాలి


స్కీం వర్కర్ల సమావేశంలో మాట్లాడుతున్న కల్పన

కొత్తపట్నం: స్కీం వర్కర్లకు కనీస వేతనం చెల్లించాలని సీఐటీయూ ఉపాధ్యక్షురాలు పి.కల్పన అన్నారు. శుక్రవారం స్కీం వర్కర్ల సమావేశంలో మాట్లాడుతూ కనీసం వేతనం రూ.26 వేలు చెల్లించాలని ఉద్యోగ భద్రత కల్పించాలని, లేబర్ కోడ్ చట్టాలను ఉపసంహరించుకోవాలని సూచించారు. స్కీం వర్కర్ల సమస్యలపై ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమానికి విజయవంతం చేయటానికి ఐక్యంగా కదలిరావాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ మండల కార్యదర్శి సూరిని స్వామిరెడ్డి మాట్లాడుతూ మండలంలో ఉన్న ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ వర్కర్స్, ఆటో కార్మికులు, వెలుగు వీవోఏలు కార్మికులంతా ఐక్యంగా ఉద్యమాలు చేయాలన్నారు. నాగమల్లేశ్వరి, వెంకాయమ్మ, ఉష, సీత, ధనలక్ష్మి, నవీన్, శ్రీను, సుజాత తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం


ప్రమాదం జరిగిన ప్రదేశంలో నిలిపి ఉన్న ఎంపీడీఓ వాహనం


వాహనాన్ని ఢీకొన్న కారు వెనుక భాగం


కారును వెనుక నుంచి ఢీకొట్టిన టిప్పర్

ఒంగోలు టౌన్: నగరంలో రద్దీగా ఉండే ముంగమూరు సెంటర్లో శుక్రవారం సాయంత్రం పెను ప్రమాదం తప్పింది. మూడు వాహనాలు ఒకదానికొకటి వెనక నుంచి ఢీ కొన్నాయి. బైపాస్ మీదుగా ఒంగోలులోకి ప్రవేశిస్తున్న బాపట్ల జిల్లా జె.పంగులూరు ఎంపీడీఓ ఎస్వీఎస్వీ రమణమూర్తి వాహనాన్ని వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొంది. ఈ కారును దాని వెనుక వస్తున్న ఒక టిప్పర్ ఢీ కొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. మూడు వాహనాలు ఒకదానికొకటి ఢీ కొనడంతో స్థానికులు గుమిగూడారు. దీంతో కాసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది.

శిద్దాను కలిసిన కరూర్ వైశ్యా బ్యాంకు ఎండీ


కరూర్ వైశ్యా బ్యాంకు ఎండీని సత్కరిస్తున్న శిద్దా రాఘవరావు

ఒంగోలు: రాష్ట్ర మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ డైరెక్టర్, జ్యోతి గ్రానైట్ ఎక్స్‌పోర్ట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ శిద్దా సుధీర్‌కుమార్‌లను శుక్రవారం కరూర్ వైశ్యా బ్యాంకు ఎండీ బి.రమేష్ కలుసుకున్నారు. మీట్ ది కస్టమర్ ప్రోగ్రాంలో భాగంగా ఆయన శిద్దా నివాసానికి విచ్చేశారు. వారిని జ్యోతి గ్రానైట్ సీఓఓ శివరాం పుష్పగుచ్ఛంతో స్వాగతించగా శిద్దా రాఘవరావు, సుధీర్‌కుమార్ దుశ్శాలువాతో సత్కరించారు.

ఘనంగా శ్రీలలితాశ్రమ వార్షికోత్సవం

ఒంగోలు టౌన్: స్థానిక కేశవ స్వామి పేటలో ఉన్న శ్రీలలితాశ్రమం 71వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఆశ్రమ ప్రాంగణంలో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకులు, జ్యోతిష్య వాస్తు సిద్ధాంతి అగస్త్యరాజు శివ ఆంధ్ర మహాభాగవతంలోని రుక్మిణి దేవి కళ్యాణ ఘట్టాన్ని ప్రవచనం చేశారు. రుక్మిణిని రాక్షస పద్ధతిలో వివాహమాడుట గురించి బమ్మెర పోతన విరచిత పద్యాల ఆలాపన ద్వారా చేసిన చేసిన ప్రసంగం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం జ్ఞానానంద సరస్వతి మాతాజీ శివను ఘనంగా సత్కరించారు.

శనగ సాగుతో సిరుల పంట

పర్చూరు నియోజకవర్గంలో శనగ సాగు	
మండలం	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)
పర్చూరు	20350 సుమారుగా..
కారంచేడు	3750
ఇంకొల్లు	4275
చినగంజాం	4172
యద్దనపూడి	5562
మార్టూరు	2275

కారంచేడు: గత మూడేళ్లుగా ప్రకృతి కరుణించడంతో వరుణ దేవుడు రైతు పక్షాన నిలిచాడు. ఫలితంగా ఖరీఫ్ సీజన్‌లో రైతులు భారీగా పంట ఉత్పత్తులు సాధించారు. రబీ సీజన్ కూడా ఆశాజనకంగా ఉండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కొత్త ఏడాదిలో అన్నదాతల మోముల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఈ ప్రాంతంలో సాగు చేసే వరి, మిరప, శనగ, పొగాకు చేలు కళకళలాడుతున్నాయి. అందుకు అన్ని విధాలుగా వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. దీంతో అన్నదాతలు ఉత్సాహంగా వివిధ రకాల పంటలు సాగు చేశారు. వీటిలో శనగ సాగు రైతుకు సిరుల పంటగా మారనుందని అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ధరలు, దిగుబడులపై పెంచుకున్న ఆశ..

ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు శనగ సాగుకు బాగున్నాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. శగన సాగులో ఈఏడాది జేజీ–11 రకం సాగులో ఎకరానికి సుమారు 10–12 బస్తాలు, కాక్–2 రకం సాగులో ఎకరానికి 8–10 బస్తాల దిగుబడులు వస్తాయనే ఆశలో అన్నదాతలు ఉన్నారు. పంట నిగారింపుతో కళకళలాడుతున్న తీరుతో వాతావరణం అనుకూలిస్తే దేవుని దయతో పంటలు వస్తాయని ఆశిస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వ ధర ప్రకారం క్వింటా ధర రూ.5280 ఉంది. అయితే మార్కెట్ ధరలు మాత్రం రూ.4400 నుంచి రూ.4600 వరకు దళారులు కొనుగోలుకు సిద్ధంగా ఉన్నారు. దిగుబడులు ఎకరానికి 10–12 బస్తాలు వచ్చి ధరలు కింటాకు రూ.7000 వరకు ఉంటే శనగ రైతుల ఇంటి సిరుల పంట కురుస్తుందని, అందుకు ప్రభుత్వం కూడా మద్దతు ధరలు పెంచేలా కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.


తెగుళ్లు సోకకుండా మందు పిచికారీ చేస్తున్న రైతు

అక్కడక్కడా కుంకుమ తెగులు..

నియోజకవర్గంలోని పైమండలాల పరిధిలో సాగు చేసిన శనగ చేలల్లో అక్కడక్కడ కుంకుమ తెగులుతో పాటు, ఎండు తెగులు కనిపిస్తుండటంతో రైతులు కొంత ఆందోళన చెందుతున్నారు. అయితే వీటిని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు మాత్రం తెగుళ్ల గురించి ఆందోళన చెందాల్సిన పని లేదని, తగు జాగ్రత్తలు తీసుకుంటే తెగుళ్లను నివారించుకోవచ్చని చెప్తున్నారు.

ఉత్కంఠగా బ్యాడ్మింటన్ పోటీలు


బహుమతులు అందుకుంటున్న విజేతలు

చీరాల అర్బన్: పట్టణంలోని డీఎస్‌ఏ రోటరీ ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ పోటీలు ఉత్కంఠగా సాగుతున్నాయి. కిరణ్‌కుమార్, షాహిద్ ఆధ్వర్యంలో చీరాల నియోజకవర్గస్థాయి, ఇన్విటేషన్ టీమ్స్‌లతో నాన్ మెడలిస్ట్ మెన్ డబుల్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నీకి 32 టీమ్‌లు పాల్గొనగా మొదటి బహుమతిని చిలకలూరిపేటకు చెందిన ఖాదర్ మస్తాన్, హర్ష, రెండో బహుమతిని చీరాలకు చెందిన హేమంత్, ఆకాష్‌లు, మూడో బహుమతిని చీరాల క్రీడాకారులు కోటా తేజరాజ్, శారికలు, నాలుగో బహుమతిని మార్టూరు క్రీడాకారులు బాజి, నజీర్‌లు గెలుపొందారు. క్రీడల ద్వారా యువకుల్లో క్రీడా నైపుణ్యం పెంచడం, ఆరోగ్య రక్షణకు ఇటువంటి టోర్నమెంట్‌లు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు కిరణ్ అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు కబీర్, కిరణ్; రిషి, రిఫరీ గాస్పర్, అజాద్, కృష్ణారెడ్డి, దంత వైద్యులు బ్లెసీ అబ్రహం పాల్గొన్నారు.

రథసప్తమి సేవల పోస్టర్ ఆవిష్కరణ


రథసప్తమి సేవల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బాలినేని

ఒంగోలు: స్థానిక శ్రీప్రసన్న చెన్నకేశవస్వామి వారికి రథసప్తమి సందర్భంగా సప్తవాహన సేవలకు సంబంధించిన పోస్టర్‌ను మాజీమంత్రి, స్థానిక శాసన సభ్యులు బాలినేని శ్రీనివాసరెడ్డి శుక్రవారం స్థానిక ఆయన నివాసంలో ఆవిష్కరించారు. ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు ఈదుపల్లి గురునాథ రావు, ఈవో రజనీకుమారి మాట్లాడుతూ శనివారం 5.30 గంటల నుంచి రాత్రి 6.30 గంటల వరకు సప్తవాహన సేవలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 6.30 గంటలకు సూర్య ప్రభవాహనం, 9 గంటలకు శేషవాహన సేవ, 10 గంటలకు గరుడ వాహనం, మధ్యాహ్నం 1.30 గంటలకు హనుమంతవాహనం, 3 గంటలకు చక్రస్నానం, సాయంత్రం 4 గంటలకు గజ వాహనం, సాయంత్రం 5 గంటలకు అశ్వ వాహనం, సాయంత్రం 6.30 గంటలకు చంద్ర ప్రభ వాహనంపై నగరోత్సవం జరుగుతుందన్నారు. నగర మేయర్ గంగాడ సుజాత, సంతనూతలపాడు శాసనసభ్యులు టీజేఆర్ సుధాకర్ బాబు, ధర్మకర్తల మండలి సభ్యులు కుర్రా ప్రసాద్ బాబు, పుచ్చకాయల గోవర్ధన్‌రెడ్డి, కరేటి కిరణ్‌బాబు, దార్ల వెంకట రవణమ్మ, దేవస్థాన అర్చక స్వాములు , సిబ్బంది పాల్గొన్నారు.


వైఎస్సార్ సీపీలో చేరిన గుండాయపాలెం టీడీపీ మాజీ సర్పంచ్ సంకే రమణయ్య

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ మాజీ సర్పంచ్

ఒంగోలు: గుండాయపాలెం టీడీపీ మాజీ సర్పంచ్ సంకే రమణయ్య శుక్రవారం స్థానిక శాసనసభ్యులు, వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ బాలినేనిని కలుసుకుని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. జగనన్న పేద, బడుగు, బలహీనవర్గాలకు అమలుచేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితుడనై తాను వైఎస్సార్ సీపీలో చేరినట్లు రమణయ్య తెలిపారు. రమణయ్యకు పార్టీ కండువా కప్పి బాలినేని ఆహ్వానించారు. ఎంపీపీ మల్లిఖార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పేతురు, జగనన్న సచివాలయాల మండల కన్వీనర్ సోమశేఖర్ పాల్గొన్నారు.

అదనపు ప్రభుత్వ ఖాజీ నియామకం


బాలినేని నుంచి పత్రాన్ని అందుకుంటున్న అదనపు ప్రభుత్వ ఖాజీ ముహీబ్

ఒంగోలు: మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు బాలినేని శ్రీనివాసరెడ్డి చేతులమీదుగా అదనపు ప్రభుత్వ ఖాజీ నియామక పత్రాన్ని సింగరాయకొండకు చెందిన మౌలానా ముఫ్తీ షేక్ ముహీబ్ అందుకున్నారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఒక కార్యక్రమానికి హాజరైన బాలినేనికి తన నియామక పత్రాన్ని అందించి కృతజ్ఞతలు తెలిపారు. ముహీబ్ మాట్లాడుతూ ఈ నియామకం మూడు సంవత్సరాలపాటు ఉంటుందంటూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. షేక్ నియాజ్, ఎస్కే మొహమ్మద్ బాషా, సయ్యద్ అబిద్ అలీ, మొహమ్మద్ గౌస్ బాషా, షేక్ సలీం ఉన్నారు.

పోలీసుల రక్షణ కోరిన ప్రేమ జంట

- సింగరాయకొండ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో పెళ్లి
- ఒంగోలు తాలుకా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు

ఒంగోలు టౌన్: అమ్మాయిది కర్నూలు, అబ్బాయిది ఒంగోలు. ఇన్‌స్టాగామ్‌లో పరిచయం అయ్యారు. పెళ్లి చేసుకొని ఒక్కటయ్యారు. అయితే రక్షణ కోరుతూ గురువారం రాత్రి ఒంగోలు తాలుకా పోలీసుల ఎదుట హాజరయ్యారు. గౌతమి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒంగోలుకు చెందిన అజయ్‌కు.. కర్నూలు చెందిన గౌతమితో మూడేళ్ల క్రితం ఇన్‌స్టాగాంలో పరిచయమైంది. ఆదికాస్త ప్రేమగా మారింది. ఇద్దరూ పెళ్లి చేసుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. కానీ కులాలు వేరు కావడంతో ఈ పెళ్లికి గౌతమి తలిదండ్రులు అంగీకరించలేదు. దాంతో ఆ అమ్మాయి ఇంటి నుంచి వచ్చేసింది. గత నవంబరు 16న వివాహం చేసుకున్నారు. విషయం తెలిసిన గౌతమి తలిదండ్రులు ఒంగోలుకు వచ్చి అజయ్‌ను కొట్టి గౌతమిని తీసుకెళ్లారు. తిరిగి ఇప్పుడు ఇంటినుంచి వచ్చి సింగరాయకొండలోని శ్రీలక్ష్మి నరసింహస్వామి దేవాలయంలో వివాహం చేసుకున్నారు. తనను, అజయ్ తలిదండ్రలను చంపుతామని తన తలిదండ్రులు బెదిరిస్తున్నారని, రక్షణ కల్పించాలని తాలుకా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జిల్లాకు ఖ్యాతి తేవాలి


శిక్షణ పూర్తి చేసుకున్న క్రీడాకారిణిలు

చీమకుర్తి: రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్న హ్యాండ్ బాల్ పోటీల్లో ప్రతిభా నైపుణ్యాలను ప్రదర్శించి జిల్లాకు మంచి పేరు ప్రతిష్టలను తీసుకురావాలని జెడ్పీటీసీ సభ్యురాలు దుంపా రమణమ్మ, హెచ్‌ఎం పి.రామారావు ఆకాంక్షించారు. అండర్–17 విభాగంలో హ్యాండ్ బాల్ క్రీడలో పాల్గొనేందుకు ఎంపికైన క్రీడాకారిణిలకు వారం రోజుల నుంచి సంతనూతలపాడు జిల్లా పరిషత్ హైస్కూలులో ఇచ్చిన శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో శిక్షణ పొందిన క్రీడాకారిణిలను అభినందించారు. సంతనూతలపాడు స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జెడ్పీటీసీ దుంపా రమణమ్మ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ డ్రెస్‌ను అందించారు. హైస్కూలు పీడీలు, హైస్కూలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.